క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా రాము



జి.సిగడాం: పొందూరు–జి.సిగడాం మండలాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు శీర రాము, ప్రధాన కార్యదర్శిగా రేగిడి సతీష్, కోశాధికారిగా వజ్రగడ సాయి ఎన్నికయ్యారు. మంగళవారం సభ్యులంతా ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జి.సిగడాం: చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం దేవరవలసలో పింఛన్లు పంపిణీ అనంతరం చేనేత కార్మికులతో మాట్లాడారు. గ్రామంలో ఇటీవల రాజులమ్మ యాత్రకు వెళ్లి సముద్ర స్నానం చేస్తుండగా కె.అశోక్ మృతి చెందడంతో అతని తండ్రి ఈశ్వరరావు, కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలరెడ్డి వెంకటరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, కుమరాపు రవికుమార్,పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, బెవర జగన్నాథం పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పంచాయతీ రామజోగిపేటలో తాగునీటి పైప్‌లైన్‌కు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఇటీవల అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది, గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు నీటి సమస్య పరిష్కరించారు.

రీసెర్చ్ విద్యార్థులకు వైవా వాయిస్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఇద్దరు పార్ట్ టైం రీసెర్చ్ స్కాలర్లకు మంగళవారం వైవా వాయిస్ నిర్వహించారు. పూర్వపు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ గుంట తులసీరావు గైడ్‌గా వీరు పీహెచ్‌డీ చేశారు. భాస్కర వెంకటరమణి మానవ వనరుల వినియోగంపై, దంతులూరి రమేష్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై పరిశోధనలు సాగించారు. త్వరలో వీరికి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయనున్నారు.

హామీలు అమలు చేసేదెన్నడు?

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఇంతవరకు హామీలు అమలు చేయకపోవడం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం దవళపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ నారాయణరావు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ధర్మకుమార్

జి.సిగడాం: రాష్ట్రస్థాయిలో జి.సిగడాం మోడల్ స్కూల్ నంబర్ వన్‌గా నిలవాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ కె.ధర్మకుమార్ అన్నారు. మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. రానున్న విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో శతశాతం ప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. ఈయనతోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, ఉపాధ్యాయులు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం వద్ద ధర్మకర్త ఇప్పిలి హరి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. 60 రోజుల పాటు చలివేంద్రం కొనసాగుతుందని హరి తెలిపారు.

రణస్థలంలో.. విద్యుత్ సబ్ డివిజన్

- పైడిభీమవరం పారిశ్రామికవాడ, లావేరు, రణస్థలం సెక్షన్లకు మెరుగైన విద్యుత్ సేవలు
- విధుల్లో చేరిన డీఈఈ



రణస్థలం సబ్ స్టేషన్

రణస్థలం:

రణస్థలంలో కొత్తగా విద్యుత్ సబ్ డివిజన్ అందుబాటులోకి వచ్చింది. పైడిభీమవరం పారిశ్రామికవాడలోని పరిశ్రమలతో పాటు రణస్థలం, లావేరు మండలాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు రణస్థలంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సబ్ డివిజన్ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) ఎం.రాజేష్ రణస్థలం విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధుల్లో చేరారు.

సబ్ డివిజన్ ఏర్పాటు ఇలా..

ఎచ్చెర్ల డివిజన్‌లో పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పైడిభీమవరం సెక్షన్లు ఉండేవి. పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీలకు అధికంగా విద్యుత్ అవసరాలు పెరగడంతో ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలు చేపట్టాల్సి వచ్చింది. మూడేళ్ల క్రితం పైడిభీమవరాన్ని సెక్షన్‌గా ఏర్పాటు చేసి ఏఈని నియమించారు. ప్రస్తుతం లావేరు, రణస్థలం, పైడిభీమవరం సెక్షన్లతో కలిసి రణస్థలం సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు.

సెక్షన్	గృహ, వాణిజ్య కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు
రణస్థలం	14,163	2,310
పైడిభీమవరం	15,882	2,808
లావేరు	19,704	4,107

మూడు సెక్షన్లు తొమ్మిది సబ్ స్టేషన్లు..

లావేరు సెక్షన్ పరిధిలో బుడుమూరు, లావేరు, అదపాక, కేశవరాయునిపాలెం సబ్ స్టేషన్లు ఉన్నాయి. రణస్థలం సెక్షన్ పరిధిలో యర్రవరం, రణస్థలం సబ్ స్టేషన్లు ఉన్నాయి. పైడిభీమవరం సెక్షన్ పరిధిలో పాతర్లపల్లి, పైడిభీమవరం ఉన్నాయి. ఈ మూడు సెక్షన్ల పరిధిలో 49,749 మంది గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 9,225 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటితో పాటు 18 భారీ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మూడు సెక్షన్ల పరిధిలోని గ్రామాలతో పాటు పరిశ్రమలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తాం. మత్స్యకార గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పాతవి కావడంతో తరచూ మొరాయించడం, లో–వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి. వీటన్నింటినీ ఒక్కొక్కటిగా సరి చేస్తాం.

– ఎం.రాజేష్, రణస్థలం డీఈఈ

కష్టపడేవారికి పార్టీలో సముచిత స్థానం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



గొర్లె కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ బవిరి రమణ

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడిన ప్రతిఒక్కరికి సముచిత స్థానం లభిస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా నియమితులైన జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణను దుశ్శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందిన ప్రతిఒక్కరూ గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులతో మమేకమై పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కూటమి పార్టీపై ఇప్పటికే తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని, దానిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయక సీఎం చంద్రబాబు చేతులెత్తేశారనే విషయాన్ని గ్రామస్థాయిలో కూటమి నాయకులు ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, మాజీ ఎంపీటీసీ ఇడదాసుల తిరుపతిరాజు, నియోజకవర్గ బీసీ సెల్, యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మజ్జి రమేష్, దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, మింద్రాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం జరిపిస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విజయ గణపతి ఆలయంలో పంచమి సందర్భంగా మంగళవారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో మూలమూర్తికి అభిషేకాలు అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అష్టద్రవ్యాలతో గణపతి హవనం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం పెరగాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: సాగులో లేని భూముల్లో ఖరీఫ్ సీజన్ నుంచి పంటలు వేసి సాగులోకి తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.త్రినాథస్వామి కోరారు. మండలంలోని కిల్లిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖాధికారి రాజగోపాలరావు మాట్లాడుతూ పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. హార్టీకల్చర్ అధికారి బి.సుదర్శన్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీఏ బి.యోగేశ్వరరావు, వెటర్నరీ వైద్యులు దిలీప్, మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ కాలనీ సమస్యలపై ఆరా



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్/గార: శ్రీకాకుళం పరిధిలోని డీసీసీబీ కాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పర్యటించారు. కొన్ని నెలలుగా జరుగుతున్న భూ ఆక్రమణ సమస్యపై కాలనీవాసులంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శ్రీ భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక రోడ్ల ఆక్రమణకు సంబంధించిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గార మండలం వాడాడ పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఉపాధి పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు నెలవారీ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, ఏపీవో సంధ్యారాణి, జేఈ నారంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ఆదాయం



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ఐ.వి.రమణ

గార: చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ వేగవంతం చేయాలని, దాని ద్వారానే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని శ్రీకాకుళం డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. మంగళవారం శాలిహుండం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ రిక్షాలు, క్లాప్ మిత్ర చేస్తున్న పనిని పరిశీలించి పలు సూచనలు చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కేంద్రం వద్ద పని సులువు అవుతుందన్నారు. ట్రై సైకిళ్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దినందుకు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కూర్మారావు, పంచాయతీ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: విశ్వ హిందూ పరిషత్ రూపొందించిన ఉగాది క్యాలెండర్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ సంప్రదాయం ప్రకారం ఉగాది నాడే నూతన సంవత్సరం ప్రారంభమవుతుందని, తిథి, వార, నక్షత్రాలు అనుసంధానంగా హిందువులు కార్యక్రమాలు చేసుకుంటారని, అందుకు అనుకూలంగా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, ఉపాధ్యక్షులు శ్రీరంగం మధుసూదనరావు, గొద్దు భాస్కరరావు, ధర్మవరపు ఆచారి, రెడ్డి గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం



హేమంత్‌కు సాయం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్‌కుమార్ కొంతకాలంలో క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నగరానికి చెందిన కె.విశ్వనాథ్, ప్రనణ్య దంపతులు, పలాస ప్రాణదాత బ్లడ్ సెంటర్ మేనేజర్ సాయి, సిరుల శరత్ మంగళవారం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులు అందించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి ఉమాశంకర్ ఇచ్చిన పిలుపు మేరకు వీరు స్పందించి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతులమీదుగా సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ అసోషియేట్ నల్ల గౌతమి, లైన్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సింధూర, బి.చిన్నయరావు, బి.జగదీష్, జి.పవన్‌కుమార్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం



ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్ సీపీ కమిటీలను నియమిస్తూ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

- ఎచ్చెర్ల మండల పార్టీ ఉపాధ్యక్షులుగా మాడుగుల జగదీశ్వరరావు, కోటిపాత్రుని హరికృష్ణ, జనరల్ సెక్రటరీలుగా గుండ భాగ్యశ్రీ, కూన వరప్రసాద్, కొత్తకోట సూర్యారావు, దుంప ఈశ్వరరావు, సెక్రటరీలుగా కారి తాతారావు, సీరపు లత, సీపాన ఎర్రన్నాయుడు, మంత్రి వెంకటకిశోర్‌కుమార్, డొంక శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆబోతుల నర్సింగరావు, గొలివి రామకృష్ణ, కూన అప్పలనాయుడు, చోడిపల్లి పాపయ్య, సనపల సూరిబాబు, లింగాల లక్ష్మణరావు, గొలివి ఆనందరావు, గొర్లె గోవిందరావు, సీపాన పూర్ణచంద్రరావు, నక్క వెంకట రమణ నియమితులయ్యారు.
- జి.సిగడాం మండల పార్టీ ఉపాధ్యక్షులుగా విక్రం కోటిబాబు (మర్రివలస), బాలి అప్పలసూరి(నడిమివలస), ప్రధాన కార్యదర్శులుగా పంచిరెడ్డి వైకుంఠరావు(గెడ్డకంచరాం), మీసాల కన్నంనాయుడు (బాతువ), మామిడి బలరాం (ఉల్లివలస), ఇజ్జి గోవిందరావు(పాలఖండ్యాం), కార్యదర్శులుగా వానప్రమీల (ఎందువ), ఇల్లాక రాములు(సీతంపేట), మీసాల శ్రీనివాసరావు (పెంట), డకర కృష్ణ(మెట్టవలస), ఏర్నేన శ్రీనివాసరావు(నిద్దాం), సభ్యులుగా కంచెర్ల పాలారావు(వీఆర్‌పేట), కుమరాపు రామమూర్తినాయుడు(డీఆర్‌వలస), అలజంగి కృష్ణ(జగన్నాథవలస), మరుపల్లి కనకరావు(గంగన్నదొరపాలెం) , కోరాడ అచ్చెరావు(జాడ), కోరాడ వాణిశ్రీ(చంద్రయ్యపేట), ముగ్గు శ్రీనివాసరావు(మధుపాం), సువ్వాడ చండీప్రసాద్(జి.సిగడాం), చందనాల తిరుపతిరావు(సంతవురిటి), జనపాల ధనుంజయరావు (దేవరవలస), మహదాస్యం నారాయణరావు (జి.సిగడాం) నియమితులయ్యారు.
- రణస్థలం మండల పార్టీ ఉపాధ్యాక్షులుగా మైలపల్లి పిల్లతాత, మింది జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కలిశెట్టి కన్నంనాయుడు, కరిమజ్జి భాస్కరరావు, పల్లి లక్ష్మణ, ఇడదాసుల తిరుపతిరాజు, కార్యదర్శులుగా సింక గౌరి, మీసాల రమేష్, బొంతు జగన్నాథం, దన్నాన శ్రీనివాసరావు, జోగ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా యామల కృష్ణ, కొత్తకోట పరిసినాయుడు, మూగి సన్యాసి, మహంతి అప్పలనాయుడు, గొర్లె రామునాయుడు, మాగుపల్లి రాముడు, బావిశెట్టి నారాయణ అప్పారావు, మైలపల్లి నరేంద్ర ప్రసాద్, రెడ్డి రామకృష్ణ, మీసాల రామునాయుడు, దన్నాన వెంకట రమేష్‌కృష్ణ, టేకి బ్రహ్మాజీలను నియమించారు.
- లావేరు మండల పార్టీ ఉపాధ్యక్షులుగా జనపాల భానోజీరావు, గొర్లె సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శులుగా దేశెట్టి తిరుపతిరావు, కొల్లి ఈశ్వరరెడ్డి, బొంతు యల్లంనాయుడు, నడిమింటి కుమారి, కార్యదర్శులుగా పెదనైన అప్పలనర్సునాయుడు, పెయ్యిల లక్ష్మణరావు, లంకలపల్లి మహేష్, దొండపర్తి చిరంజీవి, గొర్లె సూరీడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఉంగరాడ లక్ష్మణరావు, సెటికం రాంబాబు, కొన్ని ప్రసాద్, కొమ్ము సాయి, ముప్పిడి శ్రీరాములు, అరంగి శ్రీరాములు, కొన్ని పరసయ్య, మీసాల అప్పలనాయుడు, మీసాల రమణ, బాడిత రాంబాబు, పిషిణి ఉపేంద్ర, రౌతు సతీష్, కందివలస సూరిబాబులను నియమించారు.

ఒక్కరోజే రూ.1.26 కోట్ల పన్నుల వసూలు



పి.వి.వి.డి ప్రసాదరావు, కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు గతం కంటే మెరుగ్గా వసూలు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది రూ.20కోట్లు మాత్రమే వసూళ్లు చేస్తే 2024–25కు రూ.26.85 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు. ఒక్క మార్చి 31 నాడే రికార్డు స్థాయిలో రూ.1.26 కోట్ల మేర పన్నులు వసూలు చేశామని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో పన్ను వసూలు కాలేదన్నారు. 120 షాపులు సీజ్ చేయగా, 300 వరకు కుళాయి కనెక్షన్లు తొలగించినట్లు కమిషనర్ తెలిపారు.

6న సీతారాముల కల్యాణోత్సవం

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయ సమీపంలో కొన్ని రోజులుగా జరుగుతున్న సీతారామచంద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న ఉదయం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ప్రత్యేకాభిషేకాలు, ప్రాతఃకాలార్చన, సాయంత్రం దేవాతా కీర్తనలు జరుగుతున్నాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

బారులు తీరిన లారీలు



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం పరిసరాల్లో మద్యం లారీలు బారులు తీరాయి. గోదాం తక్కువగా ఉండటం, కంపెనీల నుంచి సరఫరా ఎక్కువగా ఉండటంతో రోడ్డు మొత్తం లారీలు నిండిపోయాయి. గోదాం నుంచి పాత జాతీయ రహదారి వరకు వాహనాలు నిలిచిపోయాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

చెవిటిపోలమ్మకు చల్లదనం



పెంట గ్రామంలో నూతనంగా చేపట్టిన శివాలయం నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చెవిటి పోలమ్మ(అసిరితల్లి) అమ్మవారికి గ్రామస్తులు మంగళవారం ముర్రాట్లు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని చల్లదనం చేశారు.

– జి.సిగడాం

ధర్మ స్వరూపుడు రాముడు



మానవులు ధర్మబద్ధంగా ఎలా జీవించాలో తెలియజేసేందుకు శ్రీమహావిష్ణువే రాముడిగా ఈ భూమిపై నడిచి చూపించారని ఇప్పిలి రామకృష్ణశర్మ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం 'రామాయణం ధర్మస్వరూపం' అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో పీఎల్ఎన్ రాజు, మోహనరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

బీసీ రుణాలకు దరఖాస్తుల పరిశీలన నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 117 యూనిట్లకు గాను 900 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరుకావాలని పేర్కొన్నారు. హాజరుకాని అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరిస్తామని స్పష్టం చేశారు.

గార: బీసీ కార్పొరేషన్‌లో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.